





నవోదయం

మునుపెన్నడూ చూడని ముఖ్యమంత్రి..!

హంగూ ఆర్భాటం లేకుండా.. సామాన్యులలో సామాన్యుడిలా కలిసిపోయారు. చేయాల్సిన పనిని చేసేశారు. చెప్పాల్సింది సూటిగా.. సుత్తి లేకుండా చెప్పేశారు. మడకశిర మండలం గుండుమలలో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు పర్యటనలో విశేషం ఇది. ఆ పల్లెలో పింఛన్ లబ్ధిదారులు ఓబుళమ్మ, రామన్న ఇంటికి నేరుగా నడుస్తూ వెళ్లారు. సందుగొందుల నడుమ నడుస్తూ.. సీఎంను ఓబుళమ్మ తన ఇంటికి తీసుకెళ్లారు. వితంతు పింఛన్ రూ.4 వేల నగదును ఆయన చేతులమీదుగా స్వీకరించారు. పట్టరాని ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు. ఆ తరువాత చంద్రబాబు.. రామన్న ఇంటికి వెళ్లి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. పింఛన్ సొమ్ము ఇచ్చి.. ఇంటిల్లిపాదితో గ్రూప్ ఫొటో దిగారు. అక్కడి నుంచి ఊరి నడిబొడ్డున ప్రజావేదికకు చేరుకుని ప్రసంగించారు. గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం చరిత్రలో చూడనంత నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, లక్షల కోట్ల అప్పులు మూలుగుతున్నాయని అన్నారు. అయినా సరే.. ఆదాయ మార్గాలను అన్వేషిస్తామని, సంపదను సృష్టించి పేదలకు పంచుతామని అన్నారు. పిల్లలను బాగా చదివించాలని ప్రజలకు సూచించారు. కలిసికట్టుగా కష్టపడుదామని ఉత్తేజాన్ని నింపారు. ఆయన ప్రసంగిస్తున్నంత సేపూ ఆకాశం వర్షిస్తూనే ఉంది. జనం తడిసిపోతూనే చంద్రబాబు మాటలను శ్రద్ధగా విన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు సైతం ఎలాంటి హడావుడి చేయలేదు. మునుపెన్నడూ చూడని సీఎంను జనంతోపాటు నాయకులూ చూశారు.

(వివరాలు మెయిన్‌లో, 7లో..)



గుండుమలలో చంద్రబాబు పర్యటన
హంగు.. ఆర్భాటం లేకుండా.. జనంలోకి..
వాస్తవాలను కళ్లకు కడుతూ ప్రసంగం
ఐదేళ్లలో రాష్ట్రానికి జరిగిన నష్టంపై ఆవేదన
ఆదాయం పెంచి.. గాడిలో పెడతానని భరోసా

వెల్‌కమ్ సీఎం సర్..









సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, బండారు శ్రావణిశ్రీ

వర్గీకరణతో సమాన అవకాశాలు



సుప్రీం తీర్పుపై సంఘాల హర్షం

జిల్లా వ్యాప్తంగా మాదిగల సంబరాలు.. మోదీ, చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం





↑ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్‌ఈఎఫ్, దళిత సంఘాలు, ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ ఎస్సీ మోర్చా నాయకులు ←

అనంతపురం సెంట్రల్/తాడిపత్రి, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ దేశ సర్వోన్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పును స్వాగతిస్తూ.. జిల్లా వ్యాప్తంగా మాదిగ సామాజికవర్గం ప్రజలు గురువారం సంబరాలు చేసుకున్నారు. ఆర్‌ఈఎఫ్, మాదిగ దండోరా, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి, ఇంటలెక్చువల్ ఫోరమ్ ఫర్ మాదిగాస్(ఇన్‌ఫామ్), గ్లోబల్ ఇన్‌ఫామ్ తదితర సంఘాలు, బీజేపీ ఎస్సీ మోర్చా సుప్రీం కోర్టు తీర్పును స్వాగతించాయి. అనంతపురం నగరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద వివిధ సంఘాలు, పార్టీల నాయకులు నివాళులు అర్పించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రామచంద్ర, మాదిగ దండోరా రాయలసీమ అధ్యక్షుడు అక్కులప్ప, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే శివశంకర్, మాదిగ హక్కుల పరిరక్షణ సమితి నాయకుడు సాకే రామతీర్థ, గ్లోబల్ ఇన్ఫామ్ జిల్లా అధ్యక్షుడు మారెప్ప, లాయర్ హరి ప్రసాద్, బాల గంగాధర్ తదితరులు ఎస్సీ వర్గీకరణ ఉద్యమం సాగిన తీరును గుర్తు చేశారు. ఎస్సీ సామాజికవర్గంలో 62 ఉప కులాలు ఉన్నాయని వారు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు కొన్ని ఉపకులాలకు మాత్రమే అందుతున్నాయని, మిగిలినవారు దారిద్రరేఖను అధిగమించలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ ఉప కులాలను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలని కొన్ని దశాబ్దాల నుంచి ఉద్యమాలు చేస్తున్నామని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు సార్వత్రిక ఎన్నికల సమయంలో వర్గీకరణ చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారని అన్నారు. సుప్రీం కోర్టు ధర్మాసనం వర్గీకరణపై సానుకూల తీర్పు ఇవ్వడం ద్వారా ఎస్సీలందరికీ సమాన అవకాశాలు దక్కేలా బాటలు వేసిందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు నాగన్న, నారాయణ స్వామి, జయరామ్, ఇన్‌ఫామ్, గ్లోబల్ ఇన్‌ఫామ్ నాయకులు తిరుపాలు, శశికళ, బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు ప్రభుకుమార్, మండల శాంతకుమార్, జయలక్ష్మి, శివ, రాజేష్, నవీన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పోరాటాల ఫలితం..

ఎన్నో ఏళ్ల పోరాటాలతో ఎస్సీ వర్గీకరణ సాధ్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు అంతా సంతోషంగా ఉన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వర్గీకరణ ఉద్యమంలో మొత్తం 16 మంది ప్రాణార్పణ చేశారు. తాడిపత్రిలో ఆత్మహత్య చేసుకున్న తెల్లబండ్ల రవి ఆత్మకు నేడు శాంతి చేకూరింది. వర్గీకరణకు కృషిచేసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

-గంగరాజు, ఎమ్మార్పీఎస్, తాడిపత్రి



మా పోరాటం ఫలించింది

ఎస్సీ వర్గీకరణ కోసం ఎన్నో పోరాటాలు చేశాం. మా పోరాటాలు ఫలించి నేడు సుప్రీం కోర్టు సానుకూల తీర్పు ఇవ్వడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. వర్గీకరణ కోసం చేసిన పోరాటాలు ప్రస్తుతం గుర్తుకు తెచ్చుకుంటుంటే ఆనందబాష్పాలు వస్తున్నాయి. దీనికోసం కేసులు సైతం లెక్కచేయలేదు.

-పెద్దిరాజు, ఎమ్మార్పీఎస్, తాడిపత్రి



తాడిపత్రిలో కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న నాయకులు

పోరుగడ్డ.. యర్రగుంటపల్లి

ఎస్సీ వర్గీకరణ కోసం తొంబయ్యవ దశకంలోనే తాడిపత్రి వేదికగా ఉద్యమం ఉవ్వెత్తున ఎగసింది. ఉమ్మడి రాష్ట్రంలో వర్గీకరణ ఉద్యమంలో ఎంతోమంది ప్రాణత్యాగం చేశారు. మొదట ఆత్మార్పణం చేసింది మాత్రం తాడిపత్రి మండలం యర్రగుంటపల్లికి చెందిన తెల్లబండ్ల రవి. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆమరణ దీక్షకు మద్దతుగా 1998 జూన్ 9న తాడిపత్రి తహసీల్దారు కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పెద్దిరాజు, బండారు శంకర్, కంబగిరిస్వామి పురుగుల మందు తాగారు. తెల్లబండ్ల రవి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకున్నారు. మిగిలిన ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. రవి మాత్రం ఉద్యమం కోసం ప్రాణాలు అర్పించారు. యర్రగుంటపల్లిలో రవి స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేశారు. నాటి ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటూ ఎమ్మార్పీఎస్ నాయకులు గంగరాజు, పుల్లయ్య, పెద్దిరాజు, రామాంజనేయులు, ఆంజనేయులు, కౌన్సిలర్ మల్లికార్జున, ఆదినారాయణ, ఈశ్వరయ్య, నాగభూషణం, పురుషోత్తం, లక్ష్మీదేవి, తులసి, కంబగిరి, రాంమోహన్, వెంకటరాముడు, సత్య తదితరులు తెల్లబండ్ల రవికి నివాళులు అర్పించారు. తాడిపత్రి పట్టణంలో అంబేడ్కర్ విగ్రహానికి, మందకృష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మస్తాన్ వలికి గంధం సమర్పణ



గంధం తీసుకొస్తున్న భక్తులు



స్వామివారి సన్నిధిలో గంధం

గుంతకల్లు టౌన్, ఆగస్టు 1: పాత గుంతకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి 389 ఉరుసు ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం గంధం వేడుకను ఘనంగా నిర్వహించారు. గణాచారి నాగభూషణం రెడ్డి ఇంటి నుంచి వేకువజామున అశ్వం మీద స్వామి వారి గంధాన్ని తీసుకుని బయలుదేరారు. మేళాతాళాల మధ్య దివిటీల వెలుగులో దర్గాకు చేరుకున్నారు. శివాలయం వద్ద ఉన్న బావిలో నీటిని తీసుకువచ్చి భక్తులు అశ్వం పాదాలకు పోసి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం గంధాన్ని స్వామి వారికి సమర్పించారు. స్వామి పేరిట ముజావర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకకు తరలివచ్చిన భక్తులతో దర్గా ఆవరణం, పాత గుంతకల్లు రోడ్డు కిక్కిరిసిపోయాయి. వివిధ ప్రాంతాల భక్తులు స్వామి వారికి చాదర్, చక్కెర, లడ్డు, టెంకాయలను సమర్పించారు. మరికొందరు భక్తులు దర్గా ఆవరణలో కందూరి చేశారు. వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో దర్గాలో భక్తులకు అన్నదానం చేశారు. డీఎస్పీ శివభాస్కర్ రెడ్డి, సీఐలు గణేష్, రామసుబ్బయ్య, మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ రహీంహుసేన్, ఎల్లార్తి ఈఓ షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం

వైద్యాధికారుల సూచన



తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం టౌన్, ఆగస్టు 1: తల్లిపాలతోనే పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారులు అన్నారు. జిల్లా సర్వజన వైద్యశాల చిన్న పిల్లల వార్డులో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల వద్ద బిడ్డలకు కలిగే ప్రయోజనాలను బాలింతలకు వివరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర రావు, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాల రావు, ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ డాక్టర్ సుజాత, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ తదితరులు తల్లిపాల ప్రయోజనాలను వివరించారు. పుట్టిన గంట నుంచే బిడ్డలకు తల్లి పాలు తాపించాలని సూచించారు. తల్లి పాలు బిడ్డల మానసిక ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. ఎలాంటి అపోహలు పెట్టుకోకుండా ప్రతి తల్లీ తన బిడ్డకు జన్మనిచ్చిన గంటనుంచే పాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ యుగంధర్ గైనిక్ విభాగాధిపతి విభాగం డాక్టర్ షంషాద్ బేగం, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డాక్టర్ పుష్పలత, డెమో డాక్టర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజే పండుగ

పింఛన్ల పంపిణీ 98 శాతం పూర్తి.. పర్యవేక్షించిన కలెక్టర్ వినోద్ కుమార్

పింఛన్ పంపిణీ చేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్



అనంతపురం క్లాక్‌టవర్/కూడేరు, ఆగస్టు 1: సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ జిల్లాలో తొలిరోజే 98 శాతం పూర్తి అయింది. గ్రామ-వార్డు సచివాలయ ఉద్యోగులు గురువారం ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. కలెక్టరేట్ ఎన్ఐసీ నుంచి డీఆర్‌డీఏ-వెలుగు పీడీ ఓబులమ్మ, ఏపీడీ ఈశ్వరయ్య నేతృత్వంలో 41 మంది ఉద్యోగులు పర్యవేక్షించారు. జిల్లా వ్యాప్తంగా 663 సచివాలయాల పరిధిలో 5,685 మంది సిబ్బంది, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధుల సమక్షంలో పింఛన్లను పంపిణీ చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంది. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. తపోవనంలో కలెక్టర్ స్వయంగా కొందరికి పింఛన్లను అందజేశారు.



నగరంలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

కష్టమైనా.. మాట నిలబెట్టుకుంటాం: మంత్రి పయ్యావుల కేశవ్

రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని, ఎంత కష్టమైనా ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. కూడేరు మండలం అంతరగంగ గ్రామంలో గురువారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కలెక్టర్‌తో కలసి పంపిణీ చేశారు. గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి నగదు అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ పండుగలా సాగుతోందని అన్నారు. అధికారుల ద్వారా ఇంటింటికీ పింఛన్ పంపిణీ సాధ్యం కాదని ఎన్నికల సమయంలో జగన్ చెప్పారని, కూటమి ప్రభుత్వంలో తొలిరోజే అధికార యంత్రాంగం రెండు, మూడు గంటల్లో 90 శాతం పంపిణీ పూర్తి చేసి.. సాధ్యమని నిరూపించిందని అన్నారు. పింఛన్లతో పాటు ఉద్యోగుల జీతాలు, ఇతర అంశాలకూ అంతే ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. అంతకు మునుపు గ్రామంలో మంత్రి పయ్యావుల కేశవ్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, ఐ-టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొంపల్లి శ్రీకాంత్, మాజీ ఎంపీపీ బ్రహ్మయ్య, మాజీ జెడ్పీటీసీ రామచంద్ర, కూడేరు సర్పంచు లలితమ్మ, ఇప్పేరు సర్పంచు ఓబులేసు, ఎంపీడీఓ విజయలలిత, డీటీ విశ్వనాథ్, ఏపీఎం రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్

అభినందించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



గుంతకల్లు ఆర్డీఓకు ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఆగస్టు 1: గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయానికి అరుదైన ఐఎస్ఓ సర్టిఫికెట్ దక్కింది. ఐఎస్ఓ 9001: 2015 సర్టిఫికెట్‌ను పొందిన మొదటి ప్రభుత్వ కార్యాలయంగా గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం గుర్తింపు పొందింది. ఈ గుర్తింపు దక్కాలంటే 39 రకాల ప్రమాణాలను పాటించి.. ప్రజల మన్ననలు పొందాల్సి ఉంటుంది. కలెక్టర్‌గా డాక్టర్ వినోద్ కుమార్ వచ్చినప్పటినుంచి ప్రతి కార్యాలయం ఐఎస్ఓ గుర్తింపు పొందేలా పాలనా ప్రమాణాలు అమలు చేయాలని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో తొలిసారి గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయానికి ఐఎస్ఓ సర్టిఫికెట్ దక్కడం విశేషం. కూడేరు మండలం అంతరగంగలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చేతులు మీదుగా ఐఎస్ఓ గుర్తింపు సర్టిఫికెట్‌ను ఆర్డీఓ శ్రీనివాసులరెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓను మంత్రి అభినందించారు. ఆర్డీఓను, కార్యాలయ ఉద్యోగులను కలెక్టర్ అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఇతర శాఖలు పనిచేసి ఐఎస్ఓ గుర్తింపు పొందాలని మంత్రి, కలెక్టర్ సూచించారు.

పెదనాన్నా.. నేనూ వస్తున్నా..!

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



మహబూబ్‌బాషా

అనంతపురం క్రైం, ఆగస్టు 1: సేద్యాన్నే నమ్ముకున్నాడు. ఆసరాగా ఉంటాయని ఆవులను పెంచుకున్నాడు. బోరుబావి ఎండిపోయింది. పాలిచ్చే ఆవు చనిపోయింది. అప్పులు ఎక్కువయ్యాయి. బాధలు భరించలేక మద్యానికి బానిసయ్యాడు. ఇంతలో.. తను ఎంతగానో ఇష్టపడే పెదనాన్న చనిపోయారు. దీంతో జీవితం మీద విరక్తి చెంది మహబూబ్‌బాషా(35) అనే యువ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కనగానపల్లి మండలం తూముచర్లకు చెందిన మహబూబ్ బాషా స్వగ్రామంలో ఉంటూ వ్యవసాయం చేసేవాడు. ఆయన తల్లి అనంతపురం రంగస్వామి నగర్‌లో ఉంటూ.. పూలు అమ్ముతున్నారు. నగరంలోనే ఉంటున్న మహబూబ్ బాషా పెదనాన్న మూడు రోజుల క్రితం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మహబూబ్ బాషా నగరానికి వచ్చాడు. అంత్యక్రియల అనంతరం రంగస్వామినగర్‌లో ఉన్న తల్లి వద్దకు వెళ్లాడు. 'అప్పులు ఎక్కువయ్యాయి. పెదనాన్న చనిపోయాడు. నాకు బతకాలని లేదు..' అని బంధువుల వద్ద ఆవేదన చెందాడు. మద్యం మత్తులో మాట్లాడుతున్నాడని అందరూ భావించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం తల్లి పూలు అమ్మడానికి వెళ్లగానే ఉరి వేసుకున్నాడు. రాత్రి ఆమె తిరిగొచ్చేలోగా మృతిచెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

అనంతను అగ్రస్థానంలో నిలుపుతా

- రైతులందరికీ డ్రిప్ సౌకర్యం కల్పిస్తా
- నేనే మీ వద్దకు వస్తా
- పాలకులు, అధికారులు బాధ్యతగా పనిచేయాలి
- పరిశ్రమలతో పెట్టుబడులు తీసుకొస్తా
- వక్క క్రషింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తాం
- వలస వెళ్లిన వారిని వెనక్కు రప్పిస్తాం
- సీఎం చంద్రబాబు నాయుడు ఉద్ఘాటన
- గుండుమలలో పింఛన్ పంపిణీకి హాజరు

పుట్టపర్తి(ఆంధ్రజ్యోతి), ఆగస్టు 1: హంద్రీనీవా ద్వారా ప్రతి ఎకరాకు నీరిచ్చి, తోడ్పాటునందించి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి దేశంలోనే ఉమ్మడి అనంత జిల్లా అగ్రస్థానంలో నిలుపుతానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. మడకశిర మండలం గుండుమలకు గురువారం విచ్చేసిన ముఖ్యమంత్రికి హెలీప్యాడ్ వద్ద రాష్ట్ర మంత్రులు సవిత, సత్యకుమార్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలవ శ్రీనివాసులు, బండారు శ్రావణి, కందికుంట వెంకటప్రసాద్, దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కలెక్టర్, డీఐజీ, ఎస్పీ స్వాగతం తెలిపారు. మొదట మల్బరీ రైతు రంగనాథ్‌కు సంబంధించిన షెడ్డును పరిశీలించారు. పంట సాగులో లాభాలపై ఆరాతీశారు. అక్కడి నుంచి ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. గుండుమలలోని కరియమ్మ ఆలయం ముందు మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జిల్లాలోని రైతులందరికీ డ్రిప్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. నేరుగా మీ వద్దకు వస్తాననీ, మీరు.. నావద్దకు రావాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. తద్వారా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులకు బాధ్యత పెరుగుతుందన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు కింద జిల్లాలో జీడిపల్లి, భైరవాన్‌తిప్ప, పేరూరు, గొల్లపల్లి ప్రాజెక్టులను ప్రారంభించింది తానేనన్నారు. రూ.12,500 కోట్లతో ప్రాజెక్టు పూర్తి చేశామన్నారు. తద్వారా ఉమ్మడి జిల్లాలో వేలాదిమంది రైతుల పొలాలకు నీరిచ్చామన్నారు. ఎడారి జిల్లాగా పేరుగాంచిన ఈ ప్రాంతంలో కియ పరిశ్రమకు నీరిచ్చింది కూడా హంద్రీనీవా ద్వారానేనన్నారు. జిల్లాలో 47 లక్షల ఎకరాల భూమి ఉండగా.. ఇందులో 11 లక్షల ఎకరాలు మాత్రమే సాగుభూమి అన్నారు. పంటలు సాగుచేస్తుంది మాత్రం 2 లక్షల ఎకరాల్లో మాత్రమేనన్నారు. మడకశిర ప్రాంతంలో వక్క రైతులు అధికంగా ఉన్నారన్నారు. ఇక్కడ రైతులందరూ కలిసి వక్క క్రషింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకుందామంటే భూమి, యూనిట్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయంతో ఏర్పాటు చేస్తామని సీఎం ప్రకటించారు. అలా కాదంటే ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి, ఇక్కడ వక్క క్రషింగ్ యూనిట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయనివిధంగా మారుమూల ప్రాంతం గుండుమలకు వచ్చి పింఛన్ ఇచ్చానన్నారు. గత సీఎం జగన్మోహన్ రెడ్డి వస్తే పరదాలు కట్టేవారనీ, చెట్లు నరికేవారనీ, అరెస్టులు చేసేవారన్నారు. తాను మాత్రం జనంలో ఒకడిగా గ్రామానికి వచ్చానన్నారు. జిల్లాలో చాలామంది గత ఐదేళ్లలో వలస వెళ్లారన్నారు. హంద్రీనీవా ద్వారా ప్రతి చెరువుకు నీరందించి, ప్రతి ఎకరాకు నీరిస్తామన్నారు. తద్వారా వలస వెళ్లినవారిని తిరిగి రప్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. గ్రామానికి అవసరమైన సదుపాయాలన్నీ కల్పిస్తామన్నారు. మల్బరీ రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. జిల్లాలో అధికంగా వాణిజ్య పంటలు సాగుచేసేలా ప్రోత్సహించి, ఆదుకుంటామన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 ఎమ్మెల్యే, రెండు ఎంపీస్థానాలు గెలిపించినందుకు రుణపడి ఉంటానన్నారు. అనంతను సస్యశ్యామలం చేసి, అన్నివిధాలా అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని చంద్రబాబు ఉద్ఘాటించారు. ప్రభుత్వం జవాబుదారీగా పనిచేస్తుందన్నారు. రూ.35 పింఛన్‌ను ప్రారంభించింది ఎన్టీఆర్ అనీ, దానిని రూ.70కి, తరువాత రూ.1000, రూ.2వేలు, రూ.4వేలు చేసింది ఎన్డీఏ ప్రభుత్వమన్నారు. ఏప్రిల్ నుంచి రూ.4వేలు పింఛన్ ఇస్తామని చెప్పి మాట నిలబెట్టుకున్న ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎంపీ బీకే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే గుండుమల తిప్పేస్వామి, ఈరన్న, ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాల సునీత, బండారు శ్రావణి, కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, శ్రీసత్యసాయి, అనంత జిల్లాల అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, వెంకటశివుడుయాదవ్, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి, కలెక్టర్లు చేతన్, వినోద్‌కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వభరత్, ఎస్పీలు రత్న, మురళీకృష్ణ పాల్గొన్నారు.


ప్రజావేదిక సభలో మాట్లాడుతున్న చంద్రబాబునాయుడు


గుండుమలలో ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు

జోరువానలో బాబు ప్రసంగం

హిందూపురం, ఆగస్టు 1: మడకశిర మండలం గుండుమల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజావేదిక వద్ద ప్రసంగించే సమయంలో మొదట మూడు నిమిషాల పాటు తేలికపాటి వర్షం పడింది. ఆ తరువాత 15నిమిషాల పాటు జోరువాన కురిసింది. అయినా చంద్రబాబు ప్రసంగం ఆపలేదు. జోరువానలోనే అక్కడి జనం కుర్చీలు తలపై పెట్టుకుని సీఎం ప్రసంగాన్ని విన్నారు. అంత వర్షం కురుస్తున్నా ఒక్కరూ పక్కకు వెళ్లకుండా ప్రసంగం వినడం పట్ల సీఎం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. అంతేకాకుండా చంద్రబాబు తమ గ్రామానికి రావడంతో వర్షం కురిసిందని గ్రామస్థులు సంబరపడ్డారు. మారుమూల ప్రాంతమైన తమ గ్రామానికి చంద్రబాబు రావడం అదృష్టంగా భావిస్తున్నామని ఆనందం వ్యక్తం చేశారు.

తడిసిన జిల్లా అధికారులు

ముఖ్యమంత్రి ప్రసంగిస్తున్న సమయంలో జోరువాన కురుస్తుండగా కలెక్టర్, సబ్ కలెక్టర్, డీఐజీ, ఎస్పీ అక్కడే ఉన్నారు. జోరువానలో వారు తడిసి ముద్దయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ తడిసిపోగా జిల్లా ఎస్పీ రత్న డీఐజీకి గొడుగుపట్టి జోరువానలోనే ఉండిపోయారు.

పోరాట యోధుడు ఎంఎస్‌రాజు: సీఎం

మడకశిరటౌన్, ఆగస్టు 1: మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఎప్పుడూ సమస్యలపై పోరాడుతూనే ఉంటాడని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి ఆయన కృషి చేస్తారని పేర్కొన్నారు. గురువారం గుండుమల గ్రామంలో జరిగిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఇప్పటి వరకు ఎంఎస్‌రాజు సమస్యలపై పోరాడారని, ఇప్పుడు మడకశిర నియోజకవర్గ అభివృద్ధిపై మరొకసారి పోరాటాన్ని ప్రారంభించారన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తామని వివరించారు. యువకుడు, ఉత్సాహవంతుడిని ఎమ్మెల్యేగా ఎన్నుకొన్నారని, అందులోనూ గుండుమల పంచాయతీలో తెలుగుదేశం పార్టీకి అత్యధికంగా మెజారిటీ అందించారని, అందుకు పంచాయతీ ప్రజలకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నానని సీఎం అన్నారు.


జ్ఞాపికను సీఎంకు అందజేస్తున్న ఎంఎస్ రాజు దంపతులు


వానలో కుర్చీలు తలపై పెట్టుకుని సీఎం ప్రసంగం వింటున్న జనం

అన్ని వర్గాల అభివృద్ధికి
ప్రభుత్వం కట్టుబడివుంది

ప్రజావేదికలో సీఎం చంద్రబాబునాయుడు

మడకశిర/మడకశిరటౌన్, ఆగస్టు 1: అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడివుందని సీఎం చంద్రబాబునాయుడు అన్నారు. తొలి రోజు 97శాతం పింఛన్ల పంపిణీ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. గురువారం సత్యసాయి జిల్లా మడకశిర మండలం గుండుమల గ్రామంలో జరిగిన ప్రజావేదికలో సీఎం మాట్లాడారు. మంత్రులు సవిత, సత్యకుమార్‌యాదవ్, ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు ఎం.ఎస్.రాజు, పరిటాల సునీత, బండారుశ్రావణి, కందికుంట వెంకటప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, పల్లె సింధూరారెడ్డి, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి తదితరులు ప్రజావేదికలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ చరిత్రలో మొట్టమొదటి సారిగా ఒక్క రూపాయి లంచం తీసుకోకుండా అర్హత ఉన్న లబ్ధిదారులకు వంద మంది ఉంటే 97 మందికి ఒక్కరోజులోనే పింఛను అందించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పింఛను పథకాన్ని 1985లో నందమూరి తారకరామారావు రూ.35లతో ప్రారంభించారన్నారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.200 నుంచి రూ.1000 పెంచామని వివరించారు. రూ.1000 నుంచి రూ.2వేలకు, 2024 ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు రూ.4వేలు ప్రస్తుతం అందిస్తున్నామన్నారు. అనంతరం లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించారు.

రూ. 4 వేలు అందుకోవడం సంతోషంగా ఉంది



ఎన్టీఆర్ భరోసా పింఛను రూ.4వేలు అందుకోవడం సంతోషంగా ఉంది. పేదలపై మీకు ఉన్న ప్రేమతో రూ.4వేలకు పింఛను పెంచి జీవితాల్లో వెలుగులు నింపారు. ఇతర పథకాల ద్వారా కూడా లబ్ధి పొందుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు. టీడీపీ ప్రభుత్వంలో సంతోషంగా ఉంటామన్న నమ్మకం ఏర్పడింది. ఈ ప్రభుత్వమే కొనసాగాలని దేవుడిని కోరుకొంటున్నా.

\- ఓబుళమ్మ, గుండుమల

చంద్రబాబుకు రుణపడి ఉంటాం..



జూలై నుంచి రూ.4వేలు పింఛను అందుకొంటున్నాం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్వయంగా ఇంటికి వచ్చి పింఛన్ ఇవ్వడం జీవితంలో మరిచిపోలేని సంఘటన. నెలనెలా పింఛన్ అందుతుండటంతో జీవితం సాఫీగా సాగుతోంది. ఇంటికే వచ్చి పింఛను ఇవ్వడం, అదికూడా ముఖ్యమంత్రి వచ్చి ఇవ్వడం చాలా సంతోషంగా ఉంది.

\- పులమాసి రామన్న, గుండుమల

వైసీపీ ప్రభుత్వంలో నష్టపోయాం



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మల్బరీ రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వంలో అందించిన డ్రిప్ ఇరిగేషన్ 90 శాతం సబ్సిడీని ఎత్తివేశారు. దీంతో మేము తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. రూ.50 ఇన్సెంటివ్ కూడా ఈ ఐదు సంవత్సరాల్లో ఇవ్వలేదు. రీలర్లకు కూడా అందించే రూ.120 సైతం ఇవ్వలేదు.

\- రంగనాథ్, మల్బరీరైతు, గుండుమల

మల్బరీ రైతులను అన్నివిధాలా ఆదుకుంటాం: సీఎం

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవస్థలతోపాటు వ్యవసాయ రంగాన్ని కూడా నిర్వీర్యం చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. దీనిని బాగు చేయడమే లక్ష్యంగా పెట్టుకొన్నాం. ఓబుళమ్మకు ఇల్లు కేటాయించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేయడం జరిగిందన్నారు. పేదల జీవితాల్లో వెలుగు నింపడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని వివరించారు. ఆగస్టు 15 నుంచి అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తామన్నారు. సీఎం వెంట కలెక్టర్ చేతన్‌తోపాటు ఎస్పీ రత్న, డీఐజీ బాజీజాన్‌సాయ, వివిధ శాఖల అధికారులు, నాయకులు ఉన్నారు.

మల్బరీ రైతుకు
సీఎం అభినందన


రైతుతో వివరాలు అడిగి తెలుసుకుంటున్న చంద్రబాబు

మడకశిర/మడకశిరరూరల్, ఆగస్టు 1: మల్బరీ సాగులో ఆదర్శంగా నిలిచిన రైతు రంగనాథ్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అభినందించారు. గురువారం మడకశిర మండలం గుండుమల గ్రామంలో పింఛన్ల పంపిణీ అనంతరం మల్బరీ సాగు చేస్తున్న షెడ్డును సీఎం సందర్శించారు. మల్బరీ సాగుకు సంబంధించిన వివరాలను రైతుతో అడిగి తెలుసుకున్నారు. 15 సంవత్సరాలుగా మల్బరీ సాగు చేస్తున్నామని రంగనాథ్ సీఎంకు తెలిపారు. ప్రస్తుతం ప్రతి పంటకు రూ. 90 వేల వరకు ఆదాయం పొందుతున్నామని, ఇందులో రూ. 60 వేల వరకు లాభం వస్తోందన్నారు. పట్టుగూళ్లకు ప్రభుత్వం కిలోకు రూ. 50 రాయితీ ఇచ్చిందని, ఇందుకు సీఎంకు రైతు కృతజ్ఞతలు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా తాము పొందుతున్న సబ్సిడీ నిలిచిపోయిందని వెంటనే ఇవ్వాలని పట్టు రీలర్స్ ఈ సందర్భంగా సీఎం దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం చంద్రబాబునాయుడు మాట్లాడుతూ మల్బరీ సాగులో మరింత ఆర్థిక అభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలవాలన్నారు. కాగా పట్టుపురుగుల షెడ్డును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించడం తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందని రంగనాథ్ పేర్కొన్నాడు. సీఎం వెంట మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యేలు ఎం.ఎస్.రాజు, కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కలెక్టర్ చేతన్, సబ్‌కలెక్టర్ అపూర్వ భరత్, పుట్టపర్తి ఆర్డీఓ సౌభాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పల్లెలో కలయతిరిగిన సీఎం

రైతులు, వృద్ధులకు ఆప్యాయ పలకరింపు

హిందూపురం, ఆగస్టు 1: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మడకశిర మండలంలోని గుండుమల గ్రామానికి వచ్చిన ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గ్రామంలో కలియ తిరిగారు. గురువారం సాయంత్రం 4.40 గంటలకు హెలికాప్టర్ ద్వారా గ్రామానికి చేరుకున్న సీఎంకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీ, కలెక్టర్, డీఐజీ, ఎస్పీ స్వాగతం పలికారు. ఆయన అక్కడి నుంచి గ్రామంలోకి వెళ్లి మల్బరీ షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా గుండుమల గ్రామంలో వీధులవెంట ముఖ్యమంత్రి సామాన్యుడిలా ప్రజల మధ్యన కలియతిరిగారు. గ్రామంలోని రైతులు, వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు కదిలారు. ఏమమ్మా బాగున్నారా? అంటూ మహిళలను పలుకరించారు. పొలాల్లో ఏ పంటలు పెడుతున్నారు? ఎంతమంది పిల్లలు ఉన్నారు? ఎక్కడ చదువుతున్నారు? ఏం పనిచేస్తున్నారని అందరినీ కుటుంబ సభ్యుడిలా మాట్లాడుతూ ముందుకు కదిలారు.


గ్రామస్థులతో ఆప్యాయంగా చంద్రబాబు

కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 1: కర్నూలు జిల్లా గార్లేయపురం-బ్రాహ్మణకొట్కూరు మధ్య హంద్రీనీవాను పూడ్చి కాలువలో తారురోడ్డు వేసి నీటి విడుదలను అడ్డుకున్న రోడ్డు కాంట్రాక్టర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎగువ కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలవల్ల తుంగభద్ర డ్యాం అన్ని గేట్లు ఎత్తివేసారన్నారు. దీనివల్ల శ్రీశైలం ప్రాజెక్టు పదిగేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. శ్రీశైలం డ్యాంలో నీరు పొంగిపొర్లుతున్నా బ్యాక్‌వాటర్‌పై ఆధారపడిన హంద్రీనీవా కాలువకు నీరు విడుదల చేయలేదన్నారు. హంద్రీనీవా నీటిపై ఆధారపడిన అనంతపురం, సత్యసాయి, కర్నూలు జిల్లాలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లాలో జూలైకి సంబంధించి దాదాపు 64మి.మీ.ల వర్షం కురవాల్సివుండగా కేవలం 17.2మి.మీలు మాత్రమే పడిందన్నారు. ఈ ఖరీఫ్‌లో 3.46లక్షల హెక్టార్లలో పంటలు సాగు చేయాల్సివుండగా అత్యల్పంగా 80వేల హెక్టార్లలో మాత్రమే విత్తనాలు వేశారన్నారు. గత ఏడాదితోపాటు ఈ సంవత్సరం కూడా కరువు పరిస్థితులు నెలకొన్నాయని, ఇలాంటి పరిస్థితుల్లో తుంగభద్ర డ్యాం నిండి కిందకు నీరు రావడంతో చెరువులు, కుంటలు నిండుతాయని రైతాంగం ఆశించిందన్నారు. అయితే విజయవాడ జాతీయ రహదారి పనుల పేరుతో హంద్రీనీవా కాలువను పూడ్చి, నీటిని అడ్డుకుని రోడ్డు వేయడం అత్యంత దారుణమన్నారు. రాయలసీమ జిల్లాలకు రావాల్సిన నీటిని రాకుండా ఇంతటి దుశ్చర్యకు పాల్పడుతుంటే హంద్రీనీవా అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కాలువ నీటికోసం మోటార్లు వేసుకున్న రైతులపై కేసులు పెట్టి, అపరాధ రుసుం వసూలు చేసే నీటిపారుదల శాఖ అధికారులు కాంట్రాక్టర్ ఏకంగా కాలువనే పూడ్చి తారురోడ్డు వేస్తుంటే ఎందుకు క్రిమినల్ కేసులు పెట్టడం లేదని ప్రశ్నించారు. జిల్లాలో నీటిపారుదలశాఖ అధికారులతో బుధవారం మంత్రి పయ్యావుల కేశవ్ సమీక్ష నిర్వహించి, హంద్రీనీవాకు నీరు విడుదల చేయడంలో ఆలస్యమైందని పేర్కొన్నారని, అయితే ఎందుకు ఆలస్యమైందో చెప్పలేదన్నారు. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌పై క్రిమినల్ కేసులు పెట్టి, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై, కాలువను పూడ్చేసి కళ్లప్పగించి చూస్తున్న నేషనల్ హైవే అధికారులపై విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లప్ప పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాంభూపాల్

సీఐల బదిలీలు

అనంతపురం క్రైం, ఆగస్టు 1: జిల్లాలో కొందరు సీఐలను బదిలీ చేస్తూ అనంతపురం డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. విజయవాడ ఏపీఎస్‌డీఆర్‌ఐలో పనిచేస్తున్న సీఐ రాఘవన్‌ను స్పెషల్ బ్రాంచ్‌కు, స్పెషల్‌బ్రాంచ్‌లో ఉండి ఎన్నికల సమయంలో డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేసిన సీఐ జాకీర్‌హుస్సేన్ వీఆర్‌కు పంపారు. ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న శ్రీకాంత్‌యాదవ్‌ను అనంతపురం టూటౌన్‌కు బదిలీ చేశారు. టూటౌన్ సీఐ క్రాంతికుమార్‌ను వీఆర్‌కు, డీసీఆర్‌బీ సీఐ సుబ్రహ్మణ్యంను తిరుపతి డీసీఆర్‌బీకి బదిలీ చేశారు.

శ్రీ సత్యసాయి జిల్లాలో.... తిరుపతి పీటీసీలో పనిచేస్తున్న సీఐ రాజగోపాల్‌నాయుడును హిందూపురం వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. వన్‌టౌన్‌లో పనిచేస్తున్న సీఐ శ్రీనివాస్‌ను వీఆర్‌కు పంపారు. తిరుపతి సీఐడీలో పనిచేస్తున్న ఆంజనేయులును హిందూపురం రూరల్ యూపీఎస్‌కు బదిలీచేయగా హిందూపురం రూరల్ సీఐ శ్రీనివాసులును వీఆర్‌కు పంపారు.

సమగ్రశిక్ష నుంచి అధికారుల రిలీవ్

అనంతపురం విద్య, ఆగస్టు 1: సమగ్రశిక్షలో ఫారిన్ సర్వీసు కింద పనిచేస్తూ మాతృశాఖకు బదిలీ (రీప్యాట్రేషన్) అయిన పలువురు సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులను ప్రాజక్టు నుంచి రిలీవ్ చేశారు. అసిస్టెంట్ ఏఎంఓలు చంద్రమోహన్‌రెడ్డి, మాధవరెడ్డి, అసిస్టెంట్ అలెస్కో గోవిందరెడ్డి, అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్ రాంప్రసాద్ , జీసీడీఓ మహేశ్వరి రిలీవ్ అయ్యారు. క్లర్కులు జిలాన్, గాయత్రీలను ప్రాజక్టు నుంచి రిలీవ్ చేసినట్లు సమగ్రశిక్ష ప్రాజక్టు అధికారులు తెలిపారు. ప్రాజక్టు నుంచి రిలీవ్ అయిన వారిలో పలువురు ఇప్పటికే జిల్లా విద్యాశాఖలో రిపోర్టు చేసుకున్నారు. అదేవిధంగా ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, అసిస్టెంట్ సీఎంఓ గోపాల్, అసిస్టెంట్ ఐఈడీ షమా ప్రాజక్టు నుంచి రిలీవ్ చేయడంపై సస్పెన్షన్ కొనసాగుతోంది. వీరిని ఇప్పుడే రిలీవ్ చేస్తారా..? లేక కొత్తగా రిక్రూట్‌మెంట్‌లోని పోస్టులు భర్తీ అయ్యాక రిలీవ్ చేస్తారా..? అన్నది తేలాల్సి ఉంది.

టమోటా కిలో రూ.26

అనంతపురం రూరల్, ఆగస్టు 1: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.27తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 2100 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.17, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు తెలిపారు.

లక్ష్మీనారాయణకు ఇన్‌చార్జి డీఈఈ బాధ్యతలు

అనంతపురం సిటీ, ఆగస్టు 1: ఉమ్మడి జిల్లా పంచాయతీ రాజ్‌శాఖ పరిధిలోని పెనుకొండ క్యూసీ విభాగంలో ఏఈఈగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణకు అనంతపురం పీఆర్ఐ డివిజన్-1 ఇన్‌చార్జి డీఈఈగా బాధ్యతలు అప్పగిస్తూ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన స్థానిక ఆ డివిజన్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని మండలాలతోపాటు ఏ. నారాయణపురం, రుద్రంపేట, రాజీవ్‌కాలనీ, అనంతపురం రూరల్ పంచాయతీలకు సంబంధించిన అభివృద్ధి పనులను ఈయన పర్యవేక్షించనున్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

అనిల్‌కుమార్ పూజారికి క్లాసిక్ రేటింగ్



గుంతకల్లు టౌన్, ఆగస్టు 1: పట్టణానికి చెందిన అనిల్‌కుమార్ పూజారికి చెస్‌లో క్లాసిక్ రేటింగ్ లభించింది. విజయవాడలో గత నెల జూలై 12, 13, 14 తేదీల్లో స్పార్క్ ఇంటర్నేషనల్ చెస్ టోర్నమెంటు జరిగింది. టోర్నీలో అనిల్‌కుమార్ పూజారి ప్రతిభచాటి 15-53 రేటింగ్ సాధించాడు. ఇందుకుగాను ఆయనకు క్లాసిక్ రేటింగ్‌దక్కింది.

తుంగభద్రకు వరద

బొమ్మనహాళ్, ఆగస్టు 1: తుంగభద్ర జలాశయానికి వరద కొనసాగుతోంది. బుధవారం 1,05,973 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో గురువారం సాయంత్రానికి 1,98,109 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం 1633 అడుగులతో 105 టీఎంసీలు ఉండగా గురువారం సాయంత్రం నాటిని 1631 అడుగులతో 97.870 టీఎంసీల నీటి నిల్వ ఉంది. దిగువన భారీ నీటిని విడుదల చేయడంతో హంపిలోని అనేక మండపాలు, స్మారకాలు నీట మునిగాయి. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. హెచ్చెల్సీ ఆంధ్ర సరిహద్దు 105 కి.మీ. వద్ద 1145 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

ఎమ్మార్పీఎస్ సంబరాలు



సీకేపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 1: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందక్రిష్ణ నాయకత్వంలో చేపట్టిన సుదీర్ఘ పోరాటం ఫలించిందని ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో చెన్నేకొత్తపల్లిలో గురువారం సంబరాలు జరుపుకున్నారు. అందరివాడు ఉత్సవ సొసైటీ అధ్యక్షుడు నరసింహులు ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి, మందక్రిష్ణ మాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం కేక్‌కట్‌చేసి స్వీట్లను పంపిణీ చేశారు.

రామగిరి: సుప్రీం కోర్టులో ఎస్సీ వర్గీకరణకు పచ్చజెండా చూపడంతో ఎమ్మార్పీస్, ఎస్సీసెల్ నాయకులు పేరూరులో గురువారం సంబరాలు చేసుకున్నారు. పేరూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ కమిటీ ప్రెసిడెంట్ గంగయ్య, దండోర శ్రీరాములు, టీడీపీ మండల మాజీ కన్వీనర్ సుబ్బరాయుడు, మాజీ సర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు.

గార్లదిన్నె: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కదిరప్ప అన్నారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ చేసే అధికారం ఆయా రాష్ట్రాలకు వ్వడం సంతోషకరమన్నారు.

శింగనమల: ఎస్సీ ఎస్టీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు చిన్న జలాలపురం ఓబిలేసు, టీడీపీ సోషల్ మీడియా కోర్డినేటర్ మెండిపోగుల ఎర్రిస్వామి అన్నారు. వర్గీకరణకు సహకరించిన ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, మందకృష్ణమాదిగకు కృతజ్ఞతలు తెలిపారు.

30ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితం



వెంకటేష్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 1: మాదిగల 30 ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితమని ఐక్య మాదిగ సమాజ్ అధ్యక్షుడు వంకరాజుకాలవ వెంకటేష్ అనా న్నరు. మాదిగ, మాదిగ ఉపకలాల సామాజిక సమానత్వ న్యాయ ఆత్మగౌరవ పోరాటానికి సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. మందకృష్ణమాదిగ నేతృత్వంలో 30ఏళ్ల మాదిగల పోరాటానికి సుప్రీంకోర్టు ధర్మాసనం ఫలితం ఇచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.

ఎస్కేయూ వీసీని కలిసిన టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్, ఆగస్టు 1: మండలంలోని పలువురు టీడీపీ నాయకులు ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్యను గురువారం కలిశారు. వారిని కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సాకే వీరాంజనేయులు, అనంతనాయుడు, గంగాధర్, మారుతి, వాల్మీకి ఎర్రిస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాలకు ప్రణాళికలు

అనంతపురం అర్బన్, ఆగస్టు 1: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం 28,028 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ విత్తనాలు అవసరమని వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందించింది. జిల్లాలోని అన్ని మండలాల్లో రైతుసేవా కేంద్రాల వారీగా ప్రత్యామ్నాయ విత్తనాలు ఎంత అవసరమో వివరాలు తెప్పించుకున్నారు. అలసంద, జొన్న, పెసలు, మినుము, ఉలవ, కొర్ర విత్తనాలు 28,028 క్వింటాళ్లు అవసరమని తేల్చారు. ఆ మేరకు ప్రభుత్వానికి నివేదికలు పంపారు.

విద్యుత్ శాఖ ఈఈటీ బదిలీ

అనంతపురంరూరల్, ఆగస్టు 1: విద్యుత్ శాఖ టెక్నికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న షణ్ముగం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలోని ఎల్ఎంసీ(లోడ్ మానిటరింగ్ సెల్)కు బదిలీ అయ్యారు. ఆ మేరకు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన గత కొన్ని రోజులుగా వ్యక్తిగత కారణాల నేపథ్యంలో సెలవులో ఉన్నారు. ఇన్‌చార్జి ఈఈటీగా గుత్తి డివిజన్ ఈఈ రాజశేఖర్ వ్యవహరిస్తున్నారు. రెగ్యులర్ ఈఈటీ షణ్ముగం బదిలీ కావడంతో తిరుపతి కార్యాలయంలో హెచ్ఆర్‌డీ విభాగంలో పనిచేస్తున్న ప్రసాద్‌కు ఈఈగా ఉద్యోగోన్నతి కల్పించి ఈఈటీగా నియమించారు. రెండు మూడురోజుల్లో ఈయన బాధ్యతలు చేపట్టనున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. అలాగే అనంతపురం రూరల్ డివిజన్ ఈఈ గంగాధర్ మదనపల్లికి బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో ఇంకా ఎవరినీ నియమించలేదు.

8న పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు

గార్లదిన్నె, ఆగస్టు 1: స్కూల్ మేనేజ్‌మెంట్ (ఎస్ఎంసీ) కమిటీ ఎన్నికలు 8వ తేదీన నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తారాచంద్రానాయక్, వెంకటరమణ నాయక్ తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 8న గురువారం సాయంత్రం 3.30 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సూచించారు.

పొలంబడితో అధిక దిగుబడులు

గార్లదిన్నె, ఆగస్టు 1: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు అవలంభించి దిగుబడి సాధించడానికి పొలంబడి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) రవి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని కోటంక గ్రామంలో రైతు లక్ష్మన్న పొలంలో వ్యవసాయ అధికారి సోమశేఖర్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ సోమశేఖర్, ఏఈఓ స్రవంతి, రైతులు ఎర్రిస్వామి పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో రోటీమేకర్ యంత్రం



రోటీమేకర్ యంత్రాన్ని ప్రారంభిస్తున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 1: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల శిల్పా హాస్టల్లో రోటీ మేకర్ యంత్రాన్ని ఏర్పాటుచేశారు. గురువారం ఇన్‌చార్జి వీసీ సుదర్శన రావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్య, ప్రిన్సిపాల్ సత్యనారాయణ నూతన యంత్రాన్ని ప్రారంభించారు. హాస్టల్ మేనేజర్ బాలనరసయ్య, డిప్యూటీ వార్డెన్‌లు జాజిరెడ్డి, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రతి హామీని నెరవేరుస్తాం

● ఎమ్మెల్యే పరిటాల సునీత



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే

రామగిరి, ఆగస్టు 1: ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతామని ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. గురువారం వెంకటాపురం గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఉపాధి హామీ కూలీల వద్దకు ఉదయం 6గంటలకే వెళ్లి పంపిణీచేశారు. అనందరం ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణం ఉంటుందని, రాప్తాడు నియోజకవర్గం రెండు జిల్లాల పరిధిలో ఉన్నందున మహిళలు తిరిగేందుకు అనుమతి ఇవ్వాలని సీఎం చంద్రబాబు దృష్టికితీసుకెళ్తామన్నారు. ఎంపీడీఓ రాధాకృష్ణ, ఏఓ వెంకటేశ్వరప్రసాద్, మండల కన్వీనర్‌సుధాకర్, సిబ్బంది శివ, టీడీపీ నాయకుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఇచ్చిన మాట తప్పేదేలేదు
- ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

అనంతపురం అర్బన్: ఇచ్చిన మాట తప్పేదేలేదని... ప్రతినెలా 1వతేదీనే ఉదయం 6 గంటలకే తలుపుతట్టి పింఛన్లు అందజేస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. గురువారం నగరంలోని పలు డివిజన్లలో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి అర్హులైన పింఛన్‌దారులకు పింఛన్ సొమ్మును అందజేశారు. ముందుగా స్థానిక శ్రీనగర్ కాలనీలోని టీడీపీ అర్బన్ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అరవిందనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. అరవిందనగర్, ఆదర్శనగర్, హమాలీ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, బుడ్డప్ప నగర్, సంగమేశ్వర నగర్, డీసీఎంఎస్ రోడ్డు ప్రాంతాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరయ్యారు. మాజీ మేయర్ స్వరూప, నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, సరిపూటి రమణ, బల్లా పల్లవి, పీఎం లక్ష్మీప్రసాద్, కూచి హరి, నెట్టెం బాలకృష్ణ, లక్ష్మీనరసింహ, కురబ నారాయణస్వామి పాల్గొన్నారు.



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

పేద ప్రజల ఆనందమే ప్రభుత్వానికి దీవెనలు
- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



దివ్యాంగుడికి పింఛన్‌సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం/శింగనమల/నార్పల: రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ పండుగతో పేద ప్రజల మోములో చిరునవ్వులే కూటమి ప్రభుత్వానికి దీవెనలు అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం రేకలకుంట గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. మాజీ సర్పంచ్ ఆదిశేషు, జీసీ బాబు, నరేంద్ర యాదవ్, సురేష్‌చౌదరి, సుధాకర్ పాల్గొన్నారు. అలాగే నార్పల మండలం నడిమిదొడ్డిలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలం వెంకటనరసానాయుడు, శ్రీధార్ బాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. శింగనమల మండలం సి.బండమీదపల్లిలో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. స్పెషల్ ఆఫీసర్లు ప్రభాకర్‌రావు, చంద్రశేఖర్, ఎంపీడీఓ వెంకటరమణ పాల్గొన్నారు.

గుక్కెడు నీరిచ్చి ఆదుకోండి

● ఎమ్మెల్యేకు సి.బండమీదపల్లి మహిళల వినతి



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న మహిళలు

శింగనమల, ఆగస్టు 1: అమ్మా శావణమ్మా.. నాలుగేళ్లుగా తాగునీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నాం..మాకు తాగాడానికి గుక్కెడు నీరు ఇవ్వండి అని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని సి.బండమీదపల్లి గ్రామానికి చెందిన మహిళలు మొరపెట్టుకున్నారు. గురువారం గ్రామంలో పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే వచ్చారు. ఎమ్మెల్యేకు గ్రామంలోని మహిళలు నీటి సమస్య పరిష్కరించాలని విన్నవించారు. బిందెడు నీటి కోసం రాత్రి వ్యవసాయ బోర్ల వద్దకు వెళుతున్నామని, సమస్య పరిష్కరించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడున్న ఎంపీడీఓ, జేఈని పిలిచి నీటి సమస్యపై విచారణ చేసి..వెంటనే పరిష్కారించాలని, అంతవరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు.

అర్హులందరికీ రేషన్ అందిస్తాం



రేషన్ పంపిణీ చేస్తున్న ధర్మవరపు మురళి, టీడీపీ నాయకులు

రాప్తాడు, ఆగస్టు 1: అర్హులైన పేద ప్రజలందరికీ రేషన్ పంపిణీ చేస్తామని టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి అన్నారు. గురువారం రాప్తాడు, చిన్మయ్‌నగర్‌లో నూతన డీలర్లతో కలిసి రేషన్ షాపు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం 10 ఎకరాల భూమి ఉన్న వారందరికీ రేషన్ కార్డులు తొలగించి ఐదేళ్ల వారికి రేషన్ అందకుండా చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని త్వరలోనే అందరికీ రేషన్ కార్డులు వస్తాయన్నారు. కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నారాయణస్వామి, సర్పంచులు తిరుపాలు, శీనయ్య, నాయకులు ఇంద్ర, గోనిపట్ల శీనా, జయరాముడు, జయప్ప, గోపాల్, వెంకట్రాముడు, కిష్టా, పాల్గొన్నారు. అనంతరం బొమ్మేపర్తి మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి అనారోగ్యంతో అనంతపురం నగర శివారులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా టీడీపీ నాయకులతో కలిసి మురళి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. రూ.20 వేలు ఆర్థిక సహాయం అందించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

గార్లదిన్నె, ఆగస్టు 1: తల్లిపాలు బిడ్డకు శ్రేష్టమని వైద్యాధికారి గౌతమి అన్నారు. గురువారం గార్లదిన్నెలో వైద్యాధికారి గౌతమి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ప్రతి తల్లి పురిటి బిడ్డకు అందించే మొదటి పౌష్టికాహారం ముర్రుపాలేనన్నారు. పుట్టిన గంటలోపు బిడ్డకు ముర్రుపాలు పట్టాలన్నారు. సీహెచ్ఓ లోకనాథ్, పీహెచ్ఎన్ అరుణ పాల్గొన్నారు.

నార్పల: మండల కేంద్రంతోపాటు నల్లపరెడ్డిపల్లి, గూగూడు తదితర గ్రామాల్లో గురువారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

శింగనమల: తల్లిపాలు అమృతంతో సమానమని, పుట్టి బిడ్డకు తప్పనిసరిగా ముర్రుపాలు తాగించాలని ఐసీడీఎస్ సూపవైజర్స్ ఉమాదేవి, ధనలక్ష్మి పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఉల్లికల్లు, శింగనమలలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులు, మెడికల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు.

రాప్తాడు: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యమని సర్పంచ్ తిరుపాలు అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి శ్రావణి, అంగన్‌వాడీ సూపర్వైజర్ నాగరత్న తల్లిపాల వారోత్సవాలపై పోస్టర్లు ఆవిష్కరించారు. తల్లిపాల ప్రాముఖ్యతను గ్రామాల్లో మహిళలకు అవగాహన కల్పించాలన్నారు.

మెస్ బిల్లులు, కాస్మెటిక్ చార్జీలు చెల్లించాలి

అనంతపురం విద్య, ఆగస్టు 1: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లకు పెండింగ్ ఉంచి మెస్, కాస్మెట్ చార్జీలు ప్రభుత్వం చెల్లించాలని ఏఐఎస్ఎఫ్, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నిర్వహిస్తున్న జీపుజాతా ప్రారంభ కార్యక్రమాన్ని గురువారం కేఎస్ఆర్ కళాశాలలో నిర్వహించారు. ఆ సంఘం మాజీ రాష్ట్ర నాయకులు నారాయణస్వామి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు, మాజీ యువజన నాయకులు శ్రీరాములు, మాజీ విద్యార్థి నాయకులు రమణయ్య హాజరయ్యారు. వారు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అనేక విద్యారంగ సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. హాస్టళ్లకు మెస్, కాస్మెటింగ్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే చెల్లించాలన్నారు. పలు ప్రాంతాల్లో హాస్టల్ భవనాలు పాడుబడ్డాయని, మరికొన్ని చోట్ల అద్దె భవనాల్లో నడుస్తున్నాయన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పునఃప్రారంభించాలన్నారు. ఉన్నత చదువులకు శాపంగా మారిన జీవో 77ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రమణయ్య, కుళ్లాయిస్వామి, ఆంజనేయులు, వెంకట్ నాయక్, మంజునాథ్ పాల్గొన్నారు.



జెండా ఊపి జీపు జాతాను ప్రారంభిస్తున్న నారాయణస్వామి

నార్పల: విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వీ జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన జీపుజాతా గురువారం నార్పలకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి, ప్రభుత్వ హాస్టల్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సాయిస్వరూప, రాధాజ్యోతి, హనమంతు, వంశీ, నవీన్‌సాయి, జైచంద్ర, కార్తిక్, ఉమేష్ పాల్గొన్నారు.

పింఛన్ల పండుగ

జిల్లాలో పింఛన్ల పంపిణీ పండుగలా సాగింది. అనంతపురం నగరంతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లో, మండలాల్లో, గ్రామాల్లో గురువారం ఉదయం నుంచే టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. 98 శాతం పింఛన్ల పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.

- అనంతపురం నెట్‌వర్క్



పింఛన్లు పంపిణీ చేస్తున్న స్వామిదాస్



కుంచెపు వెంకటేష్



మాజీ కార్పొరేటర్ రాజారావు



పింఛన్లు పంపిణీ చేస్తున్న చేపల హరి



కల్యాణరాణి



సంగా తేజశ్విని



అనంతపురం రూరల్‌లో...



బుక్కరాయసముద్రంలో...



శింగనమలలో...



గార్లదిన్నెలో...



చెన్నేకొత్తపల్లిలో...



కనగానపల్లిలో...



ఆత్మకూరులో...

అనంతపూర్ క్లబ్ ఎన్నికలు వాయిదా

● సామరస్యంగా నిర్వహణకు సభ్యుల చర్చలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 1: అనంతపూర్ క్లబ్ ఎన్నికలు వాయిదా వేశారు. ఇటీవల జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌ను జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ రద్దు చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన అందరి దృష్టి అనంతపూర్ క్లబ్‌పైనే అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. అనంతపూర్ క్లబ్ ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేస్తూ, విచారణ చేసి సమగ్ర నివేదిక అందజేయాలని ఆర్డీఓను ఆదేశించారు. ఇదిలా ఉంటే జిల్లా కలెక్టర్ ఆర్డీఓను విచారణ అధికారిగా నియమిస్తూ, డీసీఓ క్లబ్‌లో జరుగుతున్న పరిణామాలపై వివరాలు సేకరించాలని ఆదేశించారు. దీంతో కోఆపరేటివ్ సబ్ డివిజనల్ అధికారి బాలగంగాధర్ గురువారం క్లబ్‌ను సందర్శించి క్లబ్ సభ్యుల వివరాలు, ఓటర్ల జాబితాపై వివరాలు సేకరించారు. ఆర్డీఓ శుక్రవారం క్లబ్‌ను సందర్శించే అవకాశం ఉంది. మరోవైపు క్లబ్ పాలకవర్గం గురువారం సమావేశం నిర్వహించి సామరస్యంగా సమష్టిగా క్లబ్ ప్రతిష్ఠను నిలబెట్టే విధంగా ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని తీర్మానం చేశారు. క్లబ్‌లో గదుల అద్దెకు సంబంధించి వైసీపీ నేత నుంచి మొత్తం వసూలు చేశారు. తదుపరి ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలా లేక ఏకగ్రీవంగా సభ్యుల ఆమోదంతో పాలకవర్గాన్ని ఎన్నుకోవాలనే అంశంపై త్వరలో తేలనున్నట్లు సభ్యులు తెలిపారు.

ఘనంగా బాలగంగాధర్ తిలక్ జయంతి



సాహితీ సేవకులను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఆగస్టు 1: దేవరకొండ బాలగంగాధర్ తిలక్ 103వ జయంతిని గురువారం సాయంత్రం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్ వద్ద తెలుగు వెలుగు సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపకుడు టీవీ రెడ్డి మాట్లాడుతూ... భాష ఎంత మెత్తనిదో భావాలు అంత పదునైనవని పేర్కొన్నారు. ప్రాచీనాధునిక పాశ్చాత్య సాహిత్యంలో చాలాభాగం తిలక్ కరతలామలకమేనని పేర్కొన్నారు. అనంతరం 4 దశాబ్దాలుగా సాహితీసేవ చేస్తున్న విశాలాంధ్ర బుక్‌హౌస్ మాజీ మేనేజర్ చెట్ల ఈరన్న, ప్రస్తుత మేనేజర్ శ్రీనివాసులుకు జ్ఞాపికలు బహూకరించి సత్కరించారు. గుర్రం జాషువా సాహిత్య పీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య అనంత సాహితీ ప్రస్థానం ట్రస్టు అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, ఎస్కేయూ తెలుగుశాఖ అకడమిక్ కన్సల్టెంట్ నానీల నాగేంద్ర, పూజారి ఈరన్న, షేక్ రియాజుద్దీన్, ఆకుల రఘురామయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో అలసత్వం



కాలువలు శుభ్రం చేయిస్తున్న తెలుగురైతు అధ్యక్షుడు నారాయణస్వామి

అనంతపురం రూరల్, ఆగస్టు 1: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పనుల్లో స్థానిక వైసీపీ ప్రజాప్రతినిధులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని టీడీపీ రాప్తాడు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నారాయణస్వామి విమర్శించారు. గురువారం కురుగుంట పంచాయతీ మధు కొట్టాల్లో పారిశుధ్య పనులను పంచాయతీ కార్మికులతో చేయించారు. ఆయన మాట్లాడుతూ నెలల తరబడి కాలువలు తీయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగు ముందుకుసాగడం లేదన్నారు. పంచాయతీ పరిధిలో కురుగుంట గ్రామంతోపాటు ఐదారు కాలనీలుంటే కేవలం ఒక్క కార్మికుడితో పనులు చేయించడం చేయిస్తున్నారన్నారు. ఈ పనులు అతనొక్కడే ఎలా చేయగలరో స్థానిక ప్రజాప్రతినిధులే సమాధానం చెప్పాలన్నారు. విజయ్‌కుమార్, జాఫర్, వెంకటేష్, సుబ్బరాయుడు, నాగరాజు, అల్లాబకాష్, పరమేష్, పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి

రాప్తాడు, ఆగస్టు 1: రాప్తాడు ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సూర్యనారాయణ గౌడ్ అనారోగ్యంతో మృతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. సూర్యనారాయణ గౌడ్ అనారోగ్యంతో 25 రోజుల నుంచి బెంగళూరులో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. సూర్యనారాయణ గౌడ్ జిల్లా, రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ సంఘాల నాయకుడిగా పని చేశారన్నారు. ఆయన మృతికి పాఠశాలలో హెచ్ఎం సాంబశివ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



అనిల్ (ఫైల్)

బుక్కరయసముద్రం, ఆగస్టు 1: మండలంలోని రెడ్డిపల్లి గ్రామం వద్ద అనిల్ (32) అనే వ్యక్తి ద్విచక్రవాహనం అదపు తప్పి కింద పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు గోవిందంపల్లి గ్రామానికి చెందిన అనిల్ అనంతపురంలోని సెల్‌ఫోన్ దుకాణంలో పని చేస్తూ జీవనం సాగించేవాడు. గురువారం వ్యక్తిగత పనిమీద ద్విచక్రవాహనంలో వెళ్తుండగా రెడ్డిపల్లి గ్రామం సమీపంలో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. అతనిని చికిత్స నిమిత్తం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అనిల్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుక్కరాయసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

శింగనమల ఆగస్టు 1: మండలంలోని తరిమెల ప్రాంతంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం తరిమెల ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం రావడంతో పేకాట స్థావరంపై ఎస్ఐ పోలీస్ సిబ్బందితో దాడి చేసి నలుగురుని అరెస్టు చేసి వారి నుంచి రూ.18370, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

విద్యార్థినికి గాయాలు

అనంతపురం క్రైం, ఆగస్టు 1: రోడ్డు క్రాస్ చేస్తుండగా స్కూటర్ ఢీకొనడంతో ఓ విద్యార్థిని గాయపడింది. బుక్కరాయసముద్రం మండలం సరళాదేవి నగర్‌కు చెందిన మోక్షిత గురువారం బస్సు ఎక్కడానికి గుత్తి రోడ్డుకు వచ్చింది. రోడ్డు క్రాస్ చేస్తుండగా వేగంగా వస్తున్న స్కూటర్ ఢీ కొట్టింది. మోక్షిత కాలికి తీవ్రగాయమైంది. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


పాతకొత్తచెరువులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం


కళ్యాణదుర్గంలో దివ్యాంగుడికి పింఛన్ అందచేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని


రాయదుర్గంలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాలవ

పండుగలా పింఛన్ల పంపిణీ

- ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేసిన సచివాలయ సిబ్బంది, టీడీపీ శ్రేణులు
- పలు చోట్ల పాల్గొన్న ఎమ్మెల్యేలు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ గుంతకల్లు, ఉరవకొండ, తాడిపత్రి, శింగనమల, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో పండుగలా సాగింది. నియోజకవర్గకేంద్రాలతో పాటు మండలకేంద్రాలు, గ్రామాల్లో సైతం ఉదయం 6 గంటలకే ఎమ్మెల్యేలు, టీడీపీనాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది వచ్చి పంపిణీని ప్రారంభించారు. ఒక్కో లబ్ధిదారుడికి రూ.4 చొప్పున ఇంటి వద్దనే పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ పంపిణీ సందడి చూస్తుంటే పండుగ వాతావరణం కనిపించింది. గుంతకల్లు మండలం పాతకొత్తచెరువు గ్రామంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొని పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు రూ. 4 వేల పింఛన్‌ను ఇంటి వద్దనే లబ్ధిదారులకు పంపిణీ చేయిస్తున్నారని తెలిపారు. అలాగే కళ్యాణదుర్గం పట్టణంలోని ఎస్సీ కాలనీ, కంబదూరు మండలం అండేపల్లి గ్రామంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పింఛన్లు పంపిణీ చేసి మాట్లాడారు. పేదల కళ్లల్లో ఆనందం చూడడమే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. వారి సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. రాయదుర్గం పట్టణంలోని పార్వతినగర్‌లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గతంలో రూ.రెండు వేలు ఉన్న పింఛన్‌ను రూ.3 వేలు చేయడానికి జగన్‌కు ఐదేళ్ల కాలం పట్టిందని ఎద్దేవా చేశారు. పింఛన్లను పెద్దఎత్తున పెంచిన ఘనత చంద్రబాబుదేనని పేర్కొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి మరో 20 ఏళ్ల ఎలాంటి ఢోకా ఉండదని తెలిపారు.


పామిడి మండలం పి.కొండాపురంలో పింఛన్ అందజేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్


బెళుగుప్ప మండలం బూదవర్తిలో పొలం వద్ద వితంతువులకు పింఛన్ల పంపిణీ


గుత్తిమండలం బసినేపల్లిలో పింఛన్ సొమ్ము అందజేస్తున్న టీడీపీ నాయకులు


పుట్లూరు మండలం మడుగుపల్లిలో..


కణేకల్లులో ..


బళ్లారిలోని ఆసుపత్రిలో పింఛన్ పంపిణీ చేస్తున్న డీ హీరేహాళ్ మండల టీడీపీ నాయకులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

పామిడి, ఆగస్టు 1: పట్టణంలోని ఆదర్శ పాఠశాల, 5వ వార్డు ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు గుమ్మనూరు ఈశ్వర్ పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయా పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుండె వైద్యశిబిరానికి విశేష స్పందన

గుంతకల్లుటౌన్, ఆగస్టు1: మండలంలోని కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ సమీపంలో గల వాసవీ నిత్యాన్న సత్రం వద్ద గురువారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనంతపురంలోని కిమ్స్ సవేరా ఆసుపత్రి వైద్యులు పాల్గొని 82 మందికి గుండెకు సంబంధించిన పరీక్షలు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తాడిపత్రి, ఆగస్టు1: మండలంలోని వంగనూరు గ్రామ సమీపంలోని రైల్వేట్రాక్ వద్ద గురువారం ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో రంగారెడ్డి (45) అనే వ్యక్తి మృతిచెందాడని రైల్వే ఎస్‌ఐ నాగప్ప తెలిపారు. కడప జిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం దత్తాపురం గ్రామానికి చెందిన రంగారెడ్డి వంగనూరు సమీపంలో బహిర్భూమికి వెళ్లాడు. అనంతరం ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో రైల్వేట్రాక్ దాటుతుండగా రైలు రావడాన్ని గమనించలేదు. దీంతో రైలు ఢీకొని వెళ్లిపోయింది. అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య మల్లేశ్వరి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు రైల్వే ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

తాడిపత్రి, ఆగస్టు 1: మండలంలోని రావి వెంకటాంపల్లి సమీపంలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాలమేరకు.. రావివెంకటాంపల్లి సమీపంలో రోడ్డుపై నిద్రిస్తున్న గుర్తుతెలియని వ్యక్తిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం స్థానికులు తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి 55సంవత్సరాల వయస్సు ఉంటుందని, కలర్ లుంగీ, గోధుమ కలర్ గీతల షర్ట్ ధరించాడని పోలీసులు తెలిపారు.

వ్యక్తిపై దాడి

తాడిపత్రి, ఆగస్టు1: మండలంలోని బోడాయిపల్లి గ్రామానికి చెందిన బాలమర్రి అనే వ్యక్తిపై గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి గాయపరిచారని రూరల్ పోలీసులు తెలిపారు. బోడాయిపల్లి గ్రామంలోని దళితకాలనీకి చెందిన బాలమర్రి ఇంటి బయట నిద్రిస్తున్న సమయంలో తెల్లవారుజామున ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో దాడిచేశారు. దీంతో కేకలు విన్న గ్రామస్థులు నిద్రలేవడంతో దుండగులు పారిపోయారు. చికిత్స నిమిత్తం బాలమర్రిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుని ఫిర్యాదు అనంతరం కేసునమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఐదుగురికి స్వల్పగాయాలు

బొమ్మనహాళ్, ఆగస్టు 1 : మండలంలోని ఉంతకల్లు క్రాస్ సమీపంలో బళ్లారి, కళ్యాణదుర్గం రహదారిపై కారు బోల్తా పడి ఐదుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన మెకానిక్ బాషా గురువారం వేకువజామున తమ తల్లిదండ్రులు మక్కాకు వెళుతున్న నేపథ్యంలో వారిని ఇన్నోవా కారులో బళ్లారి రైల్వేస్టేషన్‌లో దింపి తిరిగి కుటుంబసభ్యులతో స్వగ్రామానికి బయలుదేరాడు. ఉంతకల్లు క్రాస్ సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి పొలాల వైపు దూసుకెళ్లి బోల్తా పడింది. మెకానిక్ బాషాతో పాటు మరో నలుగురు కారులో ఉన్నారు. వారందరూ స్వల్పగాయాలతో బయటపడ్డారు.

ఒకరికి తీవ్ర గాయాలు

బ్రహ్మసముద్రం: మండలంలోని బుడిమేపల్లి గ్రామానికి చెందిన గోళ్ల రంగస్వామి (40) చెలిమేపల్లిలో పీర్ల పండుగకు వెళ్లి బుధవారం రాత్రి తిరిగి స్వగ్రామానికి బైక్‌లో బయలుదేరాడు. కాగా చెలిమేపల్లి దాటగానే బైక్ అదుపుతప్పి కింద పడింది. ప్రమాదంలో అతడు తీవ్ర గాయాలయ్యాడు. స్థానికులు అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం రంగస్వామి కోమాలో ఉన్నాడని తెలిసింది. రంగస్వామి స్వతహాగా పడ్డాడా లేక ఎవరైనా యాక్సిడెంట్ చేశారా అన్న అనుమానాలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష

గుంతకల్లు టౌన్, ఆగస్టు 1: తల్లిపాలే బిడ్డకు శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మండలంలోని పాతకొత్తచెరువు గ్రామంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు తప్పకుండా తాపించాలన్నారు. తల్లిపాల వల్ల శిశువులో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. అనంతరం వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి నవీన్‌బాబు, వైద్యుడు సాయిప్రశాంత్, ఎమ్మెల్యే సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, గుమ్మనూరు నారాయణ, జనసేన నాయకుడు వాసిగిరి మణికంఠ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిల్లో సిబ్బంది తల్లిపాల వారోత్సవాలను నిర్వహించి పోస్టర్లను విడుదల చేశారు.

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి


తిరుపతినాయక్ (ఫైల్)

పామిడి, ఆగస్టు 1: నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలు వద్దగల తోటలో చోటుచేసుకుంది. స్థానికులు, బంధువుల తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. శింగనమల మండలం నాగులగుడ్డంతండాకు చెందిన వెంకటేష్‌నాయక్, సోమ్లిబాయి దంపతులు జీవనోపాధి కోసం మూడేళ్ల క్రితం వలసవచ్చి పామిడిలోని ఓ తోటలో పనికి చేరారు. వారికి కుమార్తెలు పవిత్ర బాయి, పద్మశ్రీ బాయి, కుమారులు భాను ప్రతాప్ నాయక్, తిరుపతి నాయక్ సంతానం. కాగా రోజులాగే గురువారం ఆ దంపతులు పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. ఏడాదిన్నర సంవత్సరాల వయసున్న వారి చిన్న కుమారుడు తిరుపతినాయక్ ఆడుకుంటూ ఆ పక్కనే ఉన్న నీటితొట్టెలోకి ప్రమాదవశాత్తు పడ్డాడు. గమనించిన తల్లిదండ్రులు వెంటనే చిన్నారిని బయటికి తీసి స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. దీంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. కుమారుని మృతదేహాన్ని చేతులలో పెట్టుకొని 'రే చిన్నోడా.. లేవరా' అంటూ ఆ తండ్రి విలపించిన తీరు అందరినీ కలిచివేసింది. తోట మొత్తం ఎంతో హుషారుగా తిరిగే వాడివి కదరా అంటూ.. తల్లిదండ్రుల రోదిస్తుంటే చూపరులు సైతం కంటతడి పెట్టారు.

రైల్వే గ్రౌండ్ సమస్యలను పరిష్కరించండి

గుంతకల్లు, ఆగస్టు1: పట్టణంలోని రైల్వే గ్రౌండ్‌లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ నాయకులు డీఆర్‌ఎం విజయకుమార్‌ను కోరారు. సంఘం నాయకులు గురువారం ఉదయం డీఆర్‌ఎంను కలసి రైల్వే గ్రౌండులోని సమస్యలను వివరించారు. మార్నింగ్ వాకరు, మాజీ కౌన్సిలరు అంజి మాట్లాడుతూ గ్రౌండ్‌లోని ట్రాక్ ఎగుడుదిగుడుగా ఉందని, ఓపెన్ జిమ్‌లోని పరికరాలు పనిచేయడం లేదని, వర్షపు నీరు గ్రౌండ్‌లో నిలవడం వల్ల పాచి ఏర్పడిందని తెలిపారు. మార్నింగ్ వాకర్స్ రైల్వే గ్రౌండ్ అభివృద్ధి కార్యక్రమం కోసం నెలనెలా రూ.150 సభ్యత్వ రుసుమును చెల్లించి వినియోగదారులుగా ఉన్నారన్నారు. కనుక గ్రౌండును చదను చేయించి, ఓపెన్ జిమ్ పరికరాలు పనిచేసేలా మరమ్మతులు చేయించాలని డీఆర్‌ఎంకు విన్నవించారు.

ఎమ్మెల్యే చొరవతో పారిశుధ్య పనులు

బొమ్మనహాళ్, ఆగస్టు 1: మండలంలోని బొల్లనగుడ్డం గ్రామంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండడంతో స్థానిక టీడీపీ నాయకులు స్పందించారు. మురుగు కాల్వలో పూడిక పేరుకుని నీరు ముందుకెళ్లడం లేదు. దీంతో అపరిశుభ్రత నెలకొంది. సమస్యను ఇటీవల పలువురు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదేశాల మేరకు గురువారం స్థానిక టీడీపీ నాయకులుకు డ్రైనేజీని శుభ్రపరిచారు. నాయకులు మల్లికార్జున, వన్నూరుస్వామి, గోపాల్ తదితరులు జేసీబీ ద్వారా కాలువలోని పూడికను తొలగింపజేశారు.

పూడికతీత పనులు ప్రారంభం

తాడిపత్రి, ఆగస్టు 1: పట్టణంలోని బస్టాండ్ సమీపంలో కొన్నేళ్లుగా కాలువలో పేరుకుపోయిన పూడికతీతకు సంబంధించిన పనులను గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది కాలువలోని పూడికతీతను సిబ్బందిచేత ఎత్తివేయించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

చేనేతలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలి

యాడికి, ఆగస్టు 1: చేనేత కుటుంబాలకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని చేనేత కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఇదే అంశంపై గురువారం ట్రాన్స్‌కో ఏఈని కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత కార్మికులకు వంద యూనిట్ల ఉచిత కరెంట్ ఇవ్వాలని 2018లో జీవో ఇచ్చినప్పటికీ అధికారులు పూర్తిస్థాయిలో అమలుచేయలేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గతంలో ఈ జీవో వచ్చిందని తెలిపారు. జీవోను పూర్తిస్థాయిలో అమలుచేయాలని తెలిపారు. యాడికి మండలంలో చేనేతలకు వంద యూనిట్ల ఉచిత విద్యుత్ కేవలం 1428మందికి మాత్రమే అమలుచేశారని తెలిపారు. మండలంలో చేనేతలు 7వేలకు పైగా కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. అర్హులందరికి వంద యూనిట్ల విద్యుత్ ఇవ్వాలని కోరారు. సమస్యను విన్నవించిన వారిలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ మెంబరు మాయకుంట్ల మోహన్, జిల్లా అధ్యక్షుడు బషీర్‌అహమ్మద్, చేనేత కార్మికులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 30 గొర్రె పిల్లలు మృతి

బెళుగుప్ప, ఆగస్టు 1: మండలంలోని కోనాపురంలో కుక్కల దాడిలో శ్రీరాములుకు చెందిన 30 గొర్రెపిల్లలు మృతి చెందాయి. గ్రామ శివారులోని వ్యవసాయ తోటలో దొడ్డి వేసుకుని గొర్రెలను మేపుతున్నానని, కాగా గురువారం సాయంత్రం రోజూ లాగే గొర్రెల మందను దొడ్డిలోకి తోలానని, అయితే అక్కడే ఉన్న వీధికుక్కలు దాడి చేసి 30 గొర్రెపిల్లలను చంపేశాయని, దీంతో రూ. 1.50 లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

ఆ కుటుంబానికి పింఛన్ సొమ్ము రూ.34వేలు

- ఆనందం వ్యక్తం చేసిన లబ్ధిదారులు


పింఛన్ సొమ్ము అందజేస్తున్న మాజీ ఎంపీపీ రంగయ్య

యాడికి, ఆగస్టు1: మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామంలో ఎన్టీఆర్ భరోసా కింద ఒకే కుటుంబంలో ముగ్గురు లబ్ధిదారులకు రూ.34వేలు పెన్షన్ అందింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తూట్రాళ్లపల్లికి చెందిన బూసుపల్లి నాగేంద్రమ్మకు వితంతు పింఛన్ కింద రూ.4వేలు, కుమారుడు బూసుపల్లి నరసింహారెడ్డికి వికలాంగుల పింఛన్ కింద రూ.15వేలు, కుమార్తె వరలక్ష్మికి వికలాంగ పింఛన్ కింద రూ.15వేలు అందుకున్నారు. మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య వారికి పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రమ్మ మాట్లాడుతూ... కూటమి అధికారంలోకి వచ్చాక మాలాంటి నిర్భాగ్యులకు ఎంతోమేలు జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

రాయదుర్గం, ఆగస్టు 1: హోటల్‌లో రోజు వారి కూలీగా పనిచేసే ఉడిపి ఈరన్న(56) ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని దావణగెరకు చెందిన ఈరన్న 20 ఏళ్లుగా రాయదుర్గంలోని సిండికేట్ బ్యాంక్ వెనుక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. జీవనోపాధి కోసం హోటల్ నిర్వహిస్తుండేవాడు. లాభం లేకపోవడంతో హోటల్‌ను మూసేసి ఇటీవల కార్మికుడిగా ఓ హోటల్‌లో పనిచేస్తుండేవాడు. కుటుంబపోషణ భారం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండేవాడు. ఈ క్రమంలో గురువారం మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న కారిడార్‌లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటికి భార్య గమనించి చుట్టుపక్కల వారి సాయంతో కిందికి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. రోజువారీగా రూ. 300 వందలు కూలీ గిట్టకపోవడంతో అప్పులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీటికి తోడు కర్ణాటకలోని దావణగెర వద్ద అన్నదమ్ముల మధ్య భూవివాదం కూడా ఉంది. పలు సందర్భాల్లో తన వాటా భూమి ఇస్తే అమ్ముకుని అప్పులు తీర్చుకుంటానని స్నేహితుల ముందు వాపోయినట్లు తెలిసింది. ఆత్మహత్య చేసుకున్న విషయం పోలీసులకు తెలపడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

యలగలవంకలో మహిళ..


గిరిజ (ఫైల్)

బెళుగుప్ప: మండలంలోని యలగలవంకలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటకలోని హావేరి జిల్లా గిరిసిన కొప్ప గ్రామానికి చెందిన గిరిజకు 16 యేళ్ల క్రితం ఎలగలవంకకు చెందిన గంగాధరతో వివాహమైంది. కాగా భర్త తాగుడుకు బానిస కావడంతో ఆమె ఆవేదనకు గురయ్యేది. కుటుంబ పోషణ ఇబ్బందిగా మారిందని, తాగుడు మానుకోవాలని కోరేది. భర్తలో మార్పు కనిపించకపోవడంతో బుధవారం రాత్రి మనస్థాపానికి లోనై ఇంట్లోనే ఉరివేసుకుని మృతి చెందింది. మృతురాలి తండ్రి ప్రభాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

బాధిత కుటుంబానికి మంత్రి పరామర్శ

కూడేరు, ఆగస్టు 1: మండలంలోని అంతరగంగ గ్రామానికి చెందిన గణేష్ కూలి పని చేస్తూ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం గ్రామంలో అతడి ఇంటికెళ్లి నివాళులర్పించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇరువురి ఘర్షణ

తాడిపత్రి, ఆగస్టు 1: పట్టణంలోని బుడెన్‌కాంప్లెక్స్ సమీపంలో గురువారం ప్రతాప్, కమలమ్మ ఘర్షణపడ్డారని పట్టణ పోలీసులు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో ఒకరికొకరు ఎదురుపడడంతో మాటమాట పెరిగి ఘర్షణకు దారితీసింది. స్థానికులు విడిపించడంతో సమస్య సద్దుమణిగింది. ఫిర్యాదు అనంతరం కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

వైసీపీకి రాజీనామా

ఉరవకొండ, ఆగస్టు1: వైసీపీ చేనేత విభాగం నాయకుడు, ఉరవకొండ టౌన్‌బ్యాంక్ అధ్యక్షుడు చంగల మహేష్ గురువారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ అధినేత వైఎస్ జగన్‌కు పంపానని, వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశానని, తన రాజీనామాను ఆమోదించాలని లేఖలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు. ఇటీవల కాలంలో వైసీపీకి చెందిన పలువురు నాయకులు ఆపార్టీకి రాజీనామా చేశారు.

సుప్రీంకోర్టు తీర్పుపై సంబరాలు


రాయదుర్గంలో మోదీ, చంద్రబాబు, మందకృష్ణ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

రాయదుర్గం రూరల్, ఆగస్టు 1: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ సారథ్యంలో 30 ఏళ్లపాటు అనేక పోరాటాలు చేశామని, ఎందరో మాదిగలు ధన మన ప్రాణాలను అర్పించిన ఫలితంగా ఈ రోజు సుప్రీంకోర్టు ఏబీసీడీ వర్గీకరణకు తీర్పు ఇవ్వడంపై సంతోషాన్నిచ్చిందని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు హరిగోపాల్ పేర్కొన్నారు. ఇందుకు హర్షం వ్యక్తం చేస్తూ పట్టణంలోని వినాయకసర్కిల్ వద్ద గురువారం బాణసంచా కాల్చి కేక్ కట్ చేశారు. అనంతరం ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. తర్వాత హరిగోపాల్ మాట్లాడుతూ.. దాదాపు 30 ఏళ్ల అనంతరం సుప్రీంకోర్టు ఎట్టకేలకు ఎన్‌డీఏ కూటమి సారథ్యం మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్రమోదీ సహకారంతో ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలిపిందని తెలిపారు. బీజేపీ జిల్లా సీనియర్ నాయకురాలు వసుంధరమ్మ, పట్టణ కన్వీనర్ నాగరాజు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఈశ్వరయ్య, గ్యాస్ కృష్ణ, టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి బీటీపీ చిన్న కృష్ణయ్య, నాయకులు తిప్పేస్వామి, గోవిందరాజులు, రామాంజినేయులు దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


గుంతకల్లులో ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

గుంతకల్లు టౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు పట్ల పట్టణంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాష్ట్రాల్లో చేసుకోవచ్చు అని సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడం హర్షణీయమన్నారు. మాదిగ దండోరా 30 సంవత్సరాల పోరాటం, అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని వారి ప్రాణ త్యాగాల ఫలితమే ఈ రోజు సుప్రీం కోర్టులో ఎమ్మార్పీఎస్ విజయం సాధించిందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాదిగ, మండల అధ్యక్షుడు తలారి లక్ష్మీనారాయణ మాదిగ, నియోజకవర్గ ఇన్చార్జి ఆనంద్ మాదిగ, నాయకులు పాల్గొన్నారు.


పామిడిలో సంబరాలు..

పామిడి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు వెలువడించిన తీర్పుపై పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో బీజేపీ, టీడీపీ, సీపీఐ నాయకులతో కలిసి ఎమ్మార్పీఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. దాదాపు ముప్పై ఏళ్ల నాటి పోరాటం ఫలించిందని హర్షం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అంజినాయక్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కే రహీం, ఎమ్మార్పీఎస్ నాయకులు లాలెప్ప, కుమార్‌స్వామి, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.


యాడికిలో ఎమ్మార్పీఎస్, టీడీపీ, బీజేపీ నాయకుల సంబరాలు

యాడికి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టులో తీర్పు రావడాన్ని హర్షిస్తూ యాడికిలో ఎమ్మార్పీఎస్, టీడీపీ, బీజేపీ నాయకులు కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు పుల్లయ్య మాట్లాడుతూ వర్గీకరణ ద్వారా ఎస్సీ, ఎస్టీ ఉప కులాలకు సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు, పుల్లయ్య, లక్ష్మణ్, రంగస్వామి, కంబగిరి, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


పుట్లూరులో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం ..

పుట్లూరు: ఎస్సీ వర్గీకరణ విషయంలో సుప్రీం కోర్టు తీర్పుతో మండల టీడీపీ ఎస్సీసెల్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భం గా మండలకేంద్రంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఎస్సీ సెల్ నాయకులు రామాంజనేయులు మాట్లాడు తూ గతంలో వర్గీకరణకు నాంది పలికిన అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మాదిగలు రుణపడి ఉంటామన్నారు. 30ఏళ్ల నుంచి పోరాడుతున్న మందకృష్ణ మాదిగకి మాదిగ జాతి అండగా ఉంటుందని తెలిపారు. తీర్పును టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి సుదర్శన్‌నాయుడు, మండల కన్వీనర్ బాలరంగయ్య, నాయకులు శివశంకర్‌రెడ్డి స్వాగతించారు.


చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ: గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేసింది చంద్రబాబేనని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు కొకుంట్ల రవి, సుధాకర్ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టు తీర్పుపై సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని టవర్‌క్లాక్ కూడలి టీడీపీ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టును స్వాగతిస్తున్నామన్నారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుపైన టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు నేపథ్యంలో పట్టణంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలర్పించారు.

30 ఏళ్ల పోరాటం ఫలించింది..



ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పోరాటం ఫలించింది. ఎస్సీ వర్గీకరణకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజాస్వామ్యవాదులు మద్దతు ప్రకటించడం ఆనందదాయకం. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏ కూటమికి ప్రత్యేక ధన్యవాదాలు.

- వెంకటేష్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు, గుంతకల్లు

ఎస్సీ వర్గీకరణతోనే సమన్యాయం..



ఎస్సీవర్గీకరణతోనే సమన్యాయం జరుగుతుంది. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో ఎస్సీలలో ఉన్న 59 ఉపకులాలన్నింటికి సమన్యాయం జరగటంతో పాటు అన్ని కులాలకు రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మైలురాయి.

- ఈరన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు, గుత్తి

సుప్రీం కోర్టు తీర్పు సంచలనం



సుప్రీం కోర్టు తీర్పు సంచలనంగా ఉంది. 30 ఏళ్ల ఎస్సీ వర్గీకరణ సుదీర్ఘమైన పోరాట ఫలితం దక్కింది. 1994నుంచి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప అధ్యక్షుడు మందకృష్ణమాదిగ ఏబీసీ వర్గీకరణ చేయాలని అనేక పోరాటాలు చేశారు. ఎస్సీ వర్గాల హక్కులను కాపాడేందుకు అనేక మంది నాయకులు ప్రాణత్యాగాలు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువచ్చిన చట్టం వల్లే న్యాయం బతికింది.

- నాగరాజు, మాదిగ ఉద్యోగుల ఫెడరేషన్ నియోజకవర్గ కార్యదర్శి, గుత్తి

30 ఏళ్ల కల నెరవేరింది



ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం 30 ఏళ్ల నాటి కల నెరవేరింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1996 లో అప్పటి సీఎం చంద్రబాబు ఏ రాష్ట్రంలో లేని విధంగా వర్గీకరణ అమలు చేయాలని గుర్తు చేశారు. ఈ రోజు సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంపై ఆనందంగా ఉంది.

-ఆనంద్ , టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు, రాయదుర్గం